RNI NO: TELTEL/2023/87917

# జనం వెలుగు

www.janamvelugu.com, janamvelugu2023@gmail.com

అనునిత్యం అక్షరసత్యం

సంపుటి: 03 సంచిక: 52 మే 06 మే 2025 ఎడిటర్: సీతార్ల సురేష్ పేజీలు: 8

విలేఖర్లు కావలెను

జనం వెలుగు న్యూస్ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుండి జిల్లా మరియు మండల విలేఖరులు కావలెను

ఆసక్తి కలవారు వెంటనే సంప్రదించండి

9603322119

## భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

### కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు




**జనం వెలుగు, నిజామాబాద్, మే 05 :** భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. భూ భారతి పైలట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సులలో భాగంగా సోమవారం నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం చాకిర్యాల్, కొడిచెర్ల గ్రామాలలో నిర్వహించిన సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించి, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే అన్ని మండలాల్లో నూతన చట్టం గురించి అవగాహన కల్పించామని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మెండోరా మండలాన్ని పైలెట్ ప్రాతిపదికన ఎంపిక చేసి గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బి లో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించి భూభారతి కొత్త ఆర్.ఓ.ఆర్ చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. వివిధ కారణాల వల్ల రెవెన్యూ సదస్సులో అర్జీలు సమర్పించే అవకాశం లభించని వారు తరువాత కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, అధికారులు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ధరణి పోర్టల్ ద్వారా ఆన్లైన్లో కూడా అప్లై చేసుకోవచ్చని అన్నారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వపరంగా నిర్ణీత ప్రొఫార్మాలో ప్రింట్ చేసిన దరఖాస్తులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని కలెక్టర్ కోరారు. భూ సమస్యలను పరిష్కరించుకుని, భూ వివాదాలు లేని గ్రామాలుగా పల్లెలను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సులను మెండోరా మండలంలోని అన్ని గ్రామాల రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. పైలెట్ మండలంలోని 8 రెవెన్యూ గ్రామాలలో సదస్సులు పూర్తయ్యాక, జిల్లాలోని మిగతా అన్ని మండలాలలో రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులు నిర్వహిస్తామని అన్నారు. ఈ సందర్భంగా రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్ ల వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలన జరిపి, అధికారులకు పలు సూచనలు చేశారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మాలో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలిస్తూ, సత్వర పరిష్కారానికి అనువుగా ఉన్న వాటిని తహసీల్దార్ దృష్టికి తెచ్చి పరిష్కారం జరిగేలా చూడాలన్నారు. ఈ సదస్సులలో ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, తహశీల్దార్ సంతోష్ రెడ్డి, రెవిన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భారత్ కు మద్దతుగా రష్యా


**జనం వెలుగు, న్యూఢిల్లీ, మే 5:-** ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు సంపూర్ణ మద్దతిస్తునట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. ప్రధాని మోదీకి పుతిన్ ఫోన్ చేశారు. పహల్గామ్ దాడికి తీవ్రంగా ఖండిస్తునట్టు పుతిన్ తెలిపారు. పహల్గామ్ దాడికి పాల్పడ్డ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. ఉగ్రదాడి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారతదేశానికి మద్దతు ఇవ్వడానికి రష్యా తన నిబద్ధతను పునరుద్ఘాటించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సోమవారం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఫోన్ చేసి పహల్గామ్ ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఫోన్ చేసి భారతదేశంలోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించారన్నారు. అమాయక ప్రజల మరణాలకు ఆయన తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారతదేశానికి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. పహల్గామ్ దాడికి పాల్పడ్డ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. ఉగ్రదాడి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఈ దారుణమైన దాడికి పాల్పడిన నిందితులను, వారికి సహకరించిన వారిని న్యాయం ముందు నిలబెట్టాలని పుతిన్ స్పష్టం చేశారు. భారతదేశం-రష్యా మధ్య ప్రత్యేక, విశేష వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా బలోపేతం చేయడానికి తమ నిబద్ధతను ఇద్దరు నాయకులు పునరుద్ఘాటించారు. 80వ విజయ దినోత్సవం సందర్భంగా అధ్యక్షుడు పుతిన్‌కు ప్రధానమంత్రి తన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంవత్సరం చివర్లో భారతదేశంలో జరగనున్న వార్షిక శిఖరాగ్ర సమావేశానికి పుతిన్‌ను ఆహ్వానించారు.

## వడ్ల కాంటా ఆలస్యం - రైతుల్లో వర్ష భయం



**జనంవెలుగు, నందిపేట్:** మండలంలోని పలు గ్రామాల రైతులు తీవ్ర ఆందోళనకు లోనవుతున్నారు. పంట కోసి వడ్లను కుప్పలుగా వేసి నిడివి రోజులైనా కాంట కాకపోవడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే వడ్లు కోసి దాదాపు 30 రోజులు గడుస్తున్నప్పటికీ కొనుగోలు కేంద్రాలు స్పందించకపోవడం రైతుల్లో ఆగ్రహం రేపుతోంది. ఉరుములు, మెరుపులతో వర్ష సూచనలు కనిపిస్తుండటంతో రైతులు రాత్రి పూట వడ్ల కుప్పలకు కాపలాగా ఉంటున్నారు. కష్టంతో పండించిన పంట వర్షాల వల్ల పాడైపోతుందేమోనని భయపడుతున్నారు. వీటి నేపథ్యంలో వెంటనే కాంట ప్రక్రియ చేపట్టి వడ్లను కొనుగోలు చేయాలని అధికారులను రైతులు కోరుతున్నారు. తమ కష్టాలను గుర్తించి, ప్రభుత్వమే తగిన చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రజావాణికి 117 ఫిర్యాదులు



**జనం వెలుగు, నిజామాబాద్, మే 05 :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 117 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లతో పాటు జడ్పీ సీఈవో సాయాగౌడ్, నిజామాబాద్ ఇంచార్జి ఆర్డీఓ స్రవంతిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి మూడవ ర్యాంకు సాధించిన గట్టు షైనీకి ఘన సన్మానం



**జనం వెలుగు, నిజామాబాద్, మే 05:-** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెల్మల్ లో చదువుతున్న గట్టు షైనీ పదవ తరగతిలో 584 మార్కులతో జిల్లా స్థాయిలో మూడవ ర్యాంకు సాధించింది. ఈ మేరకు ఆమెను జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ సోమవారం తన కార్యాలయంలో శాలువా కప్పి, బోకేతో సన్మానించారు. ప్రభుత్వ పాఠశాల నుండి ఇంత గొప్ప ర్యాంకు సాధించడం అభినందనీయమని పేర్కొంటూ, ఈ విజయానికి పాఠశాల ఉపాధ్యాయుల సమిష్టి కృషి ఉందని కొనియాడారు. గట్టు షైనీ సాధన ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

### టిజిఎండిసి ఛైర్మన్ ఈరవత్రి అనిల్



**జనం వెలుగు, బాల్కొండ:-** గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని టిజిఎండిసి ఛైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నాడు. ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటి సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన కమిటీ సోమవారం సిఎం రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలను తెలిపారు. సమగ్ర ఎన్ఆర్ఐ పాలసీతో కూడిన గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయడానికి తమ కమిటి అధ్యయనం చేసి ఓ నివేదిక తయారు చేస్తోందని ఆయన అన్నాడు. ఈ కార్యక్రమంలో కమిటి ఛైర్మన్ డాక్టర్ బిఎం వినోద్ కుమార్, వైస్ ఛైర్మన్ మంద భీం రెడ్డి, సభ్యులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, చెన్నమనేని శ్రీనివాస రావు, గుగ్గిల్ల రవిగౌడు, నంగి దేవేందర్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల తదితరులు పాల్గొన్నారు.

## నందిపేట్ తహసీల్దార్‌పై సందిగ్ధత: సస్పెన్షనా? బదిలినా?




**జనంవెలుగు, నందిపేట్:-** నందిపేట్ మండల తహసీల్దార్‌పై సస్పెన్షన్ జరిగిందా? లేక బదిలి జరిగిందా? అనే అంశంపై మండల ప్రజల్లో గందరగోళం నెలకొంది. కొన్ని రోజులుగా ఆయన కార్యాలయంలో కనిపించకపోవడంతో ఊహాగానాలు ఊపందుకున్నాయి. కొందరు తహసీల్దార్‌ను సస్పెండ్ చేశారని చెబుతుండగా, మరికొందరు ఆయన దీర్ఘకాలిక సెలవులో ఉన్నారంటూ వాదిస్తున్నారు. ఈ తాహతా వెనుక అసలు కారణం మండలంలోని ఓ గ్రామంలో వివాదాస్పద భూమిని తహసీల్దార్ ఆమోదంతో రిజిస్టేషన్ చేయించాడనే ఆరోపణలు వెలువడుతున్నాయి. ఇంకా, బతికే ఉన్న వ్యక్తుల పేరుతో మరణ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి, అసైన్మెంట్ భూములను అక్రమంగా అక్రమ రిజిస్ట్రేషన్ చేశాడన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అసైన్మెంట్ భూముల రిజిస్ట్రేషన్, అక్రమ వెంచర్లకు, కబ్జాల వంటి అనేక అక్రమాలకు పరోక్షంగా సహకరిస్తున్నారని గుసగుసలు చాలానే గుప్పుమంటున్నాయి. ఇవి కేవలం ఊహాగానాలా? లేక నిజంగా తహసీల్దార్ క్రమశిక్షణ చర్యలకు గురయ్యారా? అన్నది స్పష్టత అవసరమై ఉంది. అధికారవర్గాలు ఇప్పటి వరకు దీనిపై ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు.